క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉమాగౌరి

పాతపట్నం: అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తి ఊపిరి తీసుకోలేకపోతే సీపీఆర్ ప్రక్రియ చేయాలని హోమియో వైద్యురాలు ఎస్.ఉమాగౌరి అన్నారు. మండలంలోని తెంబూరు గ్రామంలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో సీపీఆర్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ సీపీఆర్ నిర్వహించిన సమయంలో రక్తం సరఫరా బాగా జరుగుతుందన్నారు. సీపీఆర్ చేస్తూ ఉండగానే అంబులెన్స్‌కి ఫోన్ చేయాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సంతబొమ్మాళిలో కృష్ణదాస్ పర్యటన

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం టెక్కలి నియోజకవర్గ పరిధిలోని సంతబొమ్మాళి మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పోలాకి మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలతలగాం, గోవిందపురం గ్రామాల్లో నిర్వహించనున్న రచ్చబండ సమావేశాల్లో పాల్గొంటారు.

సురక్షా యాప్‌తో నకిలీ మద్యం గుర్తింపు



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న సీఐ వై.రాజు

పొందూరు: ఏపీ ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజ్ సురక్షా యాప్‌తో నకిలీ మద్యం గుర్తింపు బాధ్యత మద్యం దుకాణాల్లో పని చేసే నౌకర్ నామాలదేనని పొందూరు ఎక్సైజ్ సీఐ వై.రాజు తెలిపారు. పొందూరు, జి.సిగడాం మండలాల్లోని మద్యం దుకాణాల్లో యాప్ ద్వారా నకిలీ మద్యం గుర్తింపు విధానాన్ని బుధవారం నౌకర్ నామాలకు వివరించారు. యాప్ ద్వారా స్కాన్ చేస్తే మద్యం నాణ్యత బయటపడుతుందన్నారు. నకిలీ మద్యాన్ని గుర్తిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

పొందూరు: మండలంలోని పుల్లాజీపేటలో కొన్నేళ్లుగా ఎయిర్ బ్రేక్ స్విచ్‌లేని కారణంగా తలెత్తుతున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పొందూరు ఎలక్ట్రికల్ ఏఈ సుధాకర్‌ను గ్రామస్తులు కోరారు. ఏఈకి గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందించారు. రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో తమ గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందారని, దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. మరో ముగ్గురు విద్యుత్ షాక్‌కు గురై మరణం అంచులవరకు వెళ్లి బయటపడ్డారన్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాం మండలం అన్నాపురం గ్రామానికి చెందిన ఫల్గుణరావు ద్విచక్ర వాహనంపై చాపర గ్రామానికి వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉర్లాం విద్యార్థులు



వాలీబాల్ పోటీల్లో పాల్గొనున్న విద్యార్థులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనున్నారని హెచ్ఎం భారతి బుధవారం తెలిపారు. అండర్ 17 వాలీబాల్ పోటీల్లో ఎల్.కార్తికేయ, కె.వినయ్‌కుమార్, అండర్ 14 విభాగం వాలీబాల్ పోటీల్లో ఉదయసాయి, కిరణ్ పాల్గొంటారన్నారు. విద్యార్థులు, పీఈటీ జగదీష్‌ను అభినందించారు

రూ.4 లక్షలతో గోరువాని చెరువు అభివృద్ధి

నరసన్నపేట: మేజరు పంచాయతీలోని గోరువాని చెరువును కార్తీక మాసంలో స్నానాలకు వీలుగా పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో బాగుచేస్తున్నట్టు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. చెరువులో పూడిక తీసి నీరు పెట్టనున్నామన్నారు. ఈ మేరకు బుధవారం పనులను జీసీ హోమ్ వద్ద ప్రారంభించారు. హనుమాన్ కూడలి నుంచి నీటిని చెరువుకు మళ్లించనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్, సతీష్ పాల్గొన్నారు.

పంట పండింది

- పాతపట్నం నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల్లో స్వలకాలిక వరి సాగు
- మరో వారం రోజుల్లో కోతలు ప్రారంభం
- దిగుబడులపైనే రైతన్నల ఆశలు



ధనుపురం వద్ద కోతకు సిద్ధంగా ఉన్న స్వల్పకాలిక వరి పంట

పాతపట్నం: స్వల్పకాలిక వరి రకం పంట పండింది. మరో వారం రోజుల్లో కోత కోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. స్వల్ప కాలిక వరి కోతలు పూర్తయితే అదే పొలాన్ని దుక్కి చేసి వాణిజ్య పంటలను వేసుకుంటారు. నదీ తీర గ్రామాలతోపాటు సమీప గ్రామాల్లో స్వల్పకాలిక వరిసాగు చేపట్టారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, వర్షాలు అనుకూలించడంతో పంటలు బాగున్నాయి.

పాతపట్నం నియోజకవర్గంలో స్వల్పకాలిక వరిసాగు విస్తీర్ణం (ఎకరాల్లో) ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం
పాతపట్నం	380
మెళియాపుట్టి	350
కొత్తూరు	380
హిరమండలం	350
ఎల్.ఎన్.పేట	500

నదీ తీరంలో సాగు..

పాతపట్నం నియోజకవర్గంలోని వంశధార, మహేంద్రతనయ నదీతీర గ్రామాల్లో స్వల్పకాలిక వరి సాగు చేస్తున్నారు. ఈ రెండు నదుల చెంతన పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. తీర గ్రామాలకు చెందిన రైతులు ప్రతీ ఏడాది స్వల్ప కాలిక వరి పండిస్తారు. ఈ ఏడాది సుమారు రెండు వేల ఎకరాల్లో స్వల్ప కాలిక వరి పండించారని వ్యవసాయ అధికారులు లెక్కలు చెబుతున్నారు. మే ఆఖరు, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు స్వల్ప కాలిక వరి విత్తనాలు వెద జల్లే పద్ధతిలో వేశారు. విత్తనాలు వేసిన 90 నుంచి 120 రోజుల మధ్యలో పంట కోత దశకు వస్తోంది.

వాణిజ్య పంటల సాగు..

స్వల్పకాలిక వరి కోత కోసిన తరువాత ఆయా పొలాల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తారు. మొక్కజొన్న, వేరుశనగ, సారికంద, హైబ్రీడ్ పెసర, నువ్వు, మిరప, ఉలవ, కర్బూజా తదితర పంటలను సాగు చేస్తారు. వాణిజ్య పంటల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నారు.

ఆశాజనంగా స్వల్పకాలిక వరి



ఈ ఏడాది స్వల్పకాలిక వరి విత్తనాలు వేసుకున్నప్పటి నుంచి వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉంది. రైతుల కష్టానికి తగిన ఫలితం లభించేలా దిగుబడులు వస్తాయి. వాతావరణం అనుకులిస్తే మరో రెండు, మూడు రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. స్వల్ప కాలిక వరి కోతలు, వాణిజ్య పంటలపై రైతులకు సూచనలు చేస్తున్నాం.

– కె.సింహాచలం, వ్యవసాయాధికారి, పాతపట్నం

నిరుపయోగం..

- ఎండ, వానలోనే వేచి ఉంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



జలుమూరు బస్ స్టాప్ భవనం

జలుమూరు: మండల కేంద్రం జలుమూరులో రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన ఆర్టీసీ బస్‌స్టాప్ నిరుపయోగంగా మారింది. చిన్నపాటి మరమ్మతులు చేపడితే పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడుతుంది. మండల కేంద్రంలో ఉన్న ఈ బస్‌స్టాప్‌లో ప్రైవేట్ వ్యక్తులు వారి వస్తువులు దాచుకుంటున్నారు. ఎంతో రద్దీగా ఉన్న జలుమూరు మండల కేంద్రంలో ఉదయం, సాయంత్ర పూట నిత్యం విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షిస్తారు. మండల కేంద్రం నుంచి బుడితి, కొమనాపల్లి, అచ్యుతాపురం, నగిరికటకంతోపాటు పరిసర గ్రామాలు, శ్రీముఖలింగం వరకు, చల్లవానిపేట, జర్జంగి, సారవకోట, పాతపట్నం, కోటబొమ్మాళి, టెక్కలి వెళ్లేందుకు ఇదే స్టాప్‌లో బస్సుల కోసం వేచి చూస్తారు. నిలిచునేందుకైనా ఇక్కడ స్థలం లేదు. గంటల తరబడి ఎండ, వానలో బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. చల్లవానిపేట, పాగోడు, తిమడాం, శ్రీముఖలింగం తదితర బస్ స్టాప్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

పంటలను దాచుకుంటున్నారు



మండల కేంద్రంలో ఉన్న బస్‌స్టాప్ నిరుపయోగంగా ఉంది. కొందరి రైతులు వారు పండించిన పంటలు ఇక్కడ నిల్వ చేసుకోవడం, భద్రపరుచుకోవడానికి ఉపయోగపడుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి.

– కొండాల కేశవరావు, జలుమూరు

ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉంది



పాగోడు జంక్షన్ వద్ద ఉన్న బస్‌స్టాప్ కూడా ఏళ్ల తరబడి వినియోగంలో లేదు. శిథిలావస్థలో ఉంది. వర్షం, ఎండ అయితే చాలు అందులోకి ప్రయాణికులు వెళ్తుంటారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. సుమారు 15 గ్రామాల ప్రజలకు ఇదే బస్ స్టాప్ ఉంది. దీనిని బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– దామ మన్మధరావు, సర్పంచ్, పాగోడు

మండల సమావేశంలో గందరగోళం

- వైస్ ఎంపీపీ, తహసీల్దార్ మధ్య వాగ్వాదం
- సభ నుంచి బయటకు వెళ్లిపోయిన తహసీల్దార్



వాగ్వాదం చేసుకుంటున్న తహసీల్దార్, వైస్ ఎంపీపీ

కొత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో గందరగోళం నెలకొంది. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాంబాబు మండలంలోని నివగాం, కొత్తూరులో పాడైన ఆర్‌అండ్‌బీ రహదారుల పనులు చేసేందుకు అదనంగా మండల పరిషత్ నిధులు కేటాయించినట్లు సభకు వివరించారు. సమావేశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓకు వేదికపై ఉన్న తహసీల్దార్ కె.బాలకృష్ణ రాంబాబు సూచించారు. నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. నిబంధనల ప్రకారం వేదికపై వైస్ ఎంపీపీ ఉండటం సరికాదని తహసీల్దార్ అన్నారు. దీంతో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు జోక్యం చేసుకొని నిబంధనల ప్రకారమే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీంతో తహసీల్దార్, వైస్ ఎంపీపీ మధ్య వాగ్వాదం జరిగింది. సభ్యులందరూ వేదిక వద్దకు చేరుకున్నారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. నిబంధనల ప్రకారం సభ నిర్వహించడం లేదని తహసీల్దార్ బయటకు వెళ్లిపోయారు. ఏఎస్ఐ రాజేశ్వరరావు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమనిగించారు. తరువాత సభ యథావిధిగా సాగింది. పలు శాఖలకు సంబంధించిన ప్రగతిని ఆయా అధికారులు వివరించారు.

కూటమి ప్రభుత్వానిది అరాచక పాలన

- వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణచైతన్య



పార్టీ మండల విభాగాల బాధ్యులతో ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: రాష్ట్రంలో అవినీతి, అరాచకాలే అజెండాగా పరిపాలిస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. చీడివలస గ్రామంలో మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రచ్చబండ కార్యక్రమానికి కృష్ణచైతన్య హాజరయ్యారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. రాష్ట్రంలోని అన్ని వార్గాలను సైతం మోసంచేసిన ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు సమక్షంలో వివిధ విభాగాలకు మండల స్థాయి బాధ్యులను ప్రకటించి, వారిని అభినందించారు. పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలని కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. ఎంపీపీ ముద్దాడ దమయంతి, పార్టీ నాయకులు ముద్దాడ రాము, చింతాడ ఉమ, చింతు రాఘవరావు, కణితి సత్తిబాబు, రావాడ అప్పన్నరాజు, దంత రమణ, గొల్లంగి అసిరితాత, చింతు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్



డొంకలపర్తలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

బూర్జ: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన పేదలకు, విద్యార్థులకు తీరని నష్టం కలుగుతుందని, సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో బూర్జ మండలం లక్కుపురం, అల్లెన, డొంకలపర్త గ్రామాల్లో బుధవారం రచ్చబండ సభ ఏర్పాటు చేసి కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. డొంకలపర్తలో కృష్ణదాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో ఉందని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపైన అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సర్పంచ్‌లు జడ్డు మహేష్, బొడ్డేపల్లి వెంకటసత్యం, నాయకులు తొత్తడి సురేష్, చొక్కర కృష్ణమోహన్, వియ్యపు కృష్ణ, వి.మురళీకృష్ణ, సాకేటి శ్రీనివాసరావు, ఎల్.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

పొందూరు: ఈ నెల 17 నుంచి జరుగనున్న సమ్మెలో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు కోరారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో బుధవారం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలియజేసిందన్నారు. విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

పాతపట్నం: దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.మధుసూదనరావు సూచించారు. స్థానిక శివశంకర్ కాలనీలో బుధవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

పరామర్శ..



బూర్జలో చొక్కర భగీరదుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. బూర్జ గ్రామానికి చెందిన గుడిదాపు మణికంఠ, గంగు శ్రీను, చొక్కర భగీరదుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించారు. మామిడివలలో బొంగు అన్నపూర్ణమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. టి.ఆర్ రాజుపేటలో మృతుల కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, నరేంద్రపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పార్టీ మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, గుంట్రు సుధాకర్, చొక్కర కృష్ణమోహన్, తదితరులు ఉన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు



జలుమూరు: ఆదర్శ పాఠశాలలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ మాధవరావు, ఉపాధ్యాయులు



నరసన్నపేట: సత్యవరంలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొత్తూరు: కురిగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు



హిరమండలం: ఎల్.ఎన్.పేట ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శవంతంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. కలాం విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. పలుచోట్ల మొక్కలు నాటారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఉచిత శిక్షణ ప్రారంభం

పొందూరు: మండల కేంద్రంలోని సిస్టం కళాశాలలో ఆడపిల్ల సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షురాలు, స్థానిక సచివాలయ మహిళా కానిస్టేబుల్ ఎం.లావణ్య తన సొంత డబ్బుతో 38 రోజుల పాటు యువతీ, యువకులకు శిక్షణ అందించడం మంచి పరిణామమన్నారు. ఉచిత వసతిని ఇచ్చిన సిస్టం కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహన్‌రావు ఉదారతను ప్రశంసించారు. శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సద్దుమణిగిన వివాదం

- గతేడాది సత్రాంలో టీడీపీ సానుభూతిపరులు దౌర్జన్యం
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి రేకుల షెడ్ ధ్వంసం



బాధితులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు



గతేడాది టీడీపీ సానుభూతి పరులు ధ్వంసం చేసిన రేకుల షెడ్

సారవకోట: మండలంలోని సత్రాం గ్రామంలో మురుగునీటి కాలువ తవ్వకం కోసం గత మూడు రోజుల నుంచి జరుగుతున్న వివాదం అధికారులు, గ్రామ పెద్దల చొరవతో బుధవారం సద్దుమనిగింది. వివరాల్లోకి వెళ్తే ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన కోనారి అచ్చయ్య రేకుల షెడ్ గోడను గతేడాది జూన్‌లో గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు విరగొట్టారు. దీనిపై అప్పట్లో బాధితుడు అచ్చయ్య కోర్టులో కేసు నమోదు చేశాడు. అప్పటినుంచి మురుగునీటి కాలువ ప్రస్తావన రాలేదు. సోమవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గ్రామానికి వెళ్లి గోడకు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువలో పడి ఉన్న రాళ్లు తొలగించి వెనక నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు మార్గం చూడాలని అధికారులకు సూచించారు. దీనిపై అచ్చయ్య భార్య ఉత్తరమ్మ ఎమ్మెల్యే తీరును ప్రశ్నించింది. కోర్టులో తగాదా ఉన్న స్థలంలో రాళ్లు ఎందుకు తొలగిస్తారని, ఎవరైతే తొలగిస్తారో వారిని ఆ కేసులో దోషులుగా చేస్తామని, తమ జిరాయితీ స్థలంలో కట్టుకున్న రేకుల షెడ్‌ను దౌర్జన్యంగా పగులగొట్టారని వివరించింది. దీంతో చేసేది లేక స్థానిక అధికారులు సోమ, మంగళవారాల్లో ఎటువంటి చర్యలు చేపట్టలేదు. బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సింహాచలం, ఎస్ఐ అనీల్‌కుమార్‌లు గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు తంగి రమణ సమక్షంలో కొన్నేళ్ల క్రితం ఉన్న మురుగునీటి కాలువను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్షం, మురుగునీరు వెళ్లేందుకు బాధితుడు అచ్చయ్య రేకుల షెడ్ పక్కనున్న కాలువలో పడి ఉన్న రాళ్లను తొలగించేందుకు, టీడీపీ సానుభూతిపరులు కాలువలో అడ్డంగా నిర్మించిన చిన్న గోడను తొలగించేందుకు ఒప్పందం కుదిరింది.

రోడ్డుపైకి రానున్న మురుగునీరు

ఇప్పటికే ఏ మాత్రం వర్షం కురిసినా ప్రధాన రహదారిపై మురుగునీరు నిల్వ ఉంటుంది. ప్రస్తుతం మురుగునీటి కాలువ నుంచి వర్షం నీటితోపాటు మురుగునీరు వస్తే గ్రామంలోకి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీనికి తోడు బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడే అవకాశం ఉంది.